ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణం

షాద్‌నగర్‌టౌన్, మే 7: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా మన దేశం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై మెరుపు దాడులు చేసిందని, ఆపరేషన్ సింధూర్ దేశానికే గర్వకారణమని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పహల్గాం ఉగ్రదాడిలో మన దేశ అమాయక ప్రజలు మృతి చెందడంతో దేశం మొత్తం కన్నీరు పెట్టిందని గుర్తు చేశారు. దేశ ఆర్మీ జవాన్లు ఉగ్రవాదుల నిర్మూలనే లక్ష్యంగా ఉగ్రవాదుల స్థావరాలపై చేపట్టిన ఆపరేషన్ సింధూర్ దాడులను చూసి దేశ ప్రజలు సంతోషిస్తున్నారన్నారు.

సదస్సుల నిర్వహణపై సమాచారం ఇవ్వండి

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

కొందుర్గు, మే 7: భూ భారతి చట్టం 2025 రెవెన్యూ సదస్సులకు సంబంధించి ఇతర పార్టీల నేతలకు కనీస సమాచారం ఇవ్వడంలేదని బీఆర్‌ఎస్ నాయకుడు రామకృష్ణ అన్నారు. మండలంలోని తంగెళ్లపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు గురించి మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, మాజీ ఉప సర్పంచ్ నర్సింహులుగౌడ్‌కు కనీస సమాచారం ఇవ్వకపోడాన్ని ఖండిస్తూ మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రైతులకోసమా? లేక కాంగ్రెస్ నేతలకోసమా? అన్న విషయాన్ని స్పష్టం చేస్తే బాగుంటుందన్నారు. ఇప్పటికైనా అన్ని పార్టీల నేతలకు సమాచారం ఇవ్వాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ భారతి సదస్సులు అని పెట్టుకోవాలని ఎద్దేవాచేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు శ్రీను, రవిగౌడ్, చెన్నయ్య, చంద్రయ్య, ఖాజన్న, ప్రవీణ్, నాగేశ్, బాలరాజు, పెరుమాల్‌రెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

షాబాద్, మే 7: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని రేగడిదోస్వాడ పశు వైద్యాధికారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండలంలోని వెంకమ్మగూడ, సీతారాంపూర్ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

షాబాద్, మే 7: గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్ మండలానికి చెందిన జాన్ అనే యువకుడు ఖేల్ ఇండియా వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడంతో యువకుడిని అభినందించారు. అనంతరం తన వంతు సాయంగా రూ. 50వేలు ఆర్థిక సాయాన్ని అవినాశ్‌రెడ్డి అందజేసి మాట్లాడారు.

ఘన సన్మానం



బదిలీపై వెళుతున్న రాజారత్నంను సన్మానిస్తున్న కేశంపేట ప్రభుత్వ ఉద్యోగులు

కేశంపేట, మే 7: ఉద్యోగోన్నతిపై వెళుతున్న షాద్‌నగర్ ఏడీఏ, కేశంపేట మండల ప్రత్యేకాధికారి రాజారత్నంను బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో తహసీల్దార్ ఆజం అలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీవో కిష్టయ్యతోపాటు ఆయాశాఖల ఉద్యోగులు రాజారత్నంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి నిఖిత, ఏపీవో అజీజ్‌అహ్మద్, టీఏ నీలకంఠ బాబు, పీఏసీఎస్ కొత్తపేట చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, కేశంపేట మాజీ సర్పంచ్ టి.వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిబట్లలో మాక్‌డ్రిల్

ఆదిబట్ల, మే 7: ఆపరేషన్ అభ్యాస్ అనే కోడ్ పేరుతో దేశ వ్యాప్తంగా బుధవారం సాయంత్రం ఆదిబట్ల మున్సిపాలిటీలోని తుర్కయాంజాల్, బొంగుళూరు, వండర్ల, ఆదిబట్ల ప్రాంతాల్లో ఆదిబట్ల పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, అధికారులు నాగయ్య, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, ఎస్ఐలు వెంకటేశ్, కె.రాజు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తదితరులు

పంట మార్పిడితో అధిక ఆదాయం

గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు

మంచాల : ఆరుట్లలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త రామ్‌ప్రకాశ్

మంచాల, మే 7: పంట మార్పిడితో రైతులు అధిక ఆదాయం పొందే అవకాశముందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ టి.రామ్‌ప్రకాశ్ అన్నారు. బుధవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో జయశంకర్ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ యూరియా వాడాలని అవసరమున్న మేరకు మాత్రమే రసాయనాలను వినియోగించాలని అన్నారు. ఫర్టిలైజర్ షాపుల్లో మందులు కొనుగోలు చేసిన రైతులు రసీదులను భద్రపర్చుకోవాలని వారికి సూచించారు. ఉద్యాన శాఖ వారు సబ్సిడీపై వివిధ రకాల పరికరాలతో పాటు మల్చ్ షీట్, డ్రిప్ వంటి పరికరాలను అందజేయనున్నట్లు చెప్పారు. పంట మార్పడి, చెట్ల పెంపకంతో పాటు వివిధ రకాల కూరగాయలు, పూలు, ఆయిల్‌పామ్ సాగు విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బి. పద్మజ, పరిశోధన విద్యార్థులు రాజశేఖర్, పార్వతి, మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణమోహన్, ఏఈవోలు సాయివాణి, లింగస్వామి, నిఖితతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

మొయినాబాద్, మే 7 : వానకాలంలో ముందుగా పచ్చి రొట్ట పైరును సాగు చేసుకుని పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఎస్‌జి మహదేవప్ప, డాక్టర్ రమేష్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా బుధవారం మొయినాబాద్ మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల సాగు, పంట సాగులో వినియోగించే క్రిమిసంహారక మందులు, ఎరువులు, సాగు విధానం గురించి శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం పంటకు ముందు పొలంలో పచ్చి రొట్ట సాగు చేసి భూమిలో కలియదున్నాలని చెప్పారు. దీంతో భూమి సారవంతంగా మారుతుందని పేర్కొన్నారు. అప్పుడు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. అదే విధంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదును పొందాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బీజే సురేశ్, మండల అభివృద్ధి అధికారి సంధ్య, మండల వ్యవసాయ అధికారి అనురాధ, వ్యవసాయ విస్తరణ అధికారులు కుమార్, సునీల్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, నాయకులు నీలకంఠం, అంజయ్యగౌడ్, నీరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలి

మాడ్గుల : మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు పంటలపై అవగాహన సదస్సు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ మురళి, డాక్టర్ ప్రవీణ్ హాజర్రై, శాస్త్రవేత్తలు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలోని వ్యవసాయ శాఖ మండల అధికారి అరుణాకుమారి, విస్తరణ అధికారులు దుర్గాప్రసన్న, జ్యోత్స్న, ప్రియాంక, భార్గవి, నవ్య, రాజేశ్‌నాయక్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

చేవెళ్లటౌన్, మే 7: నాంపల్లి సీబీఐ కోర్టులో ఓబుళాపురం మైనింగ్ కేసులో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నిర్దోషిగా తీర్పువెలువడడంతో నీతి నిజాయితీకి నిదర్శనమని ఉమ్మడి జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఉమ్మడి జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, మాధవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

జెండా ఎగురవేస్తున్న సీపీఎం నాయకులు, ఉపాధి కూలీలు

ఇబ్రహీంపట్నం, మే 7 : ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికై ఈ నెల 28న నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.జగన్ అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మే 1నుంచి 7వరకు మేడే ఉత్సవాలను బుధవారం మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు సరైన సౌకర్యాలు కల్పించటం లేదని, గడ్డపార, రవాణా, నీటి చార్జీలను కూడా ఇవ్వటం లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రెండున్నర లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న తలపెట్టిన చలో కలెక్టరేట్ ధర్నాకు కూలీలందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయపోల్ మాజీ ఎంపీటీసీ భిక్షపతి, సీపీఎం నాయకులు యాదయ్య, నర్సింహ, చరణ్, వంశీ తదితరులున్నారు.

భూ సమస్యను పరిష్కరించాలి

తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు అంజయ్య

కడ్తాల్, మే 7: తమ భూమి వేరొకరి పేరు మీద తప్పుగా నమోదైందని సమస్యను పరిష్కరించాలని బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ ముంతాజ్‌ను రైతు చుక్కాని అంజయ్య కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ మండల కేంద్రం సమీపంలోని సర్వే నంబర్లు 72/ఇ, 321/24, 816, 817, 846లో 2 ఎకరాల 29 గుంటల భూమి ఉన్నదని తెలిపారు. 60 ఏండ్ల నుంచి ఈ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గతంలో ధరణి ఆపరేటర్ చేసిన తప్పిదంతో తమ భూమి, అన్మాస్‌పల్లి గ్రామానికి చెందిన బాచిరెడ్డి రంగారెడ్డి పేరిట తప్పుగా నమోదైందని వివరించారు. ఏడేండ్లుగా రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రాలు అందించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. రంగారెడ్డి కుటుంబ సభ్యులు ఈ భూమిని వారసత్వంగా నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్‌ను కలిసి భూమిపై సర్వ హక్కులు తమవేనని, భూమికి సంబంధించిన పత్రాలతోపాటు వినతిపత్రాన్ని అందించినట్లు అంజయ్య పేర్కొన్నారు. స్పందించిన తహసీల్దార్ త్వరలో భూ సమస్యను పరిష్కరిస్తామని, సదరు సర్వే నంబర్లలో భూమి క్రయ విక్రయాలు జరుగకుండా భూమిని బ్లాక్ లిస్ట్‌లో పెడుతామన్నారు. భూమిపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అదే విధంగా బాధిత రైతుకు న్యాయం చేయాలని పలువురు నాయకులు తహసీల్దార్‌ని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, నాయకులు రాజేశ్, శివ, కుటుంబ సభ్యులు బాలరాజు, నిరంజనమ్మ, కృష్ణ, సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సెక్యూరిటీ సిబ్బందిపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి

అంగన్‌వాడీ భవనం ప్రారంభోత్సవంలో ఘటన

మంత్రి సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేస్తున్న దృశ్యం

నందిగామ, మే 7: నందిగామ మండల కేంద్రంలో నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి బుధవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. అంగన్‌వాడీ భవనం దగ్గరికి వెళుతున్న క్రమంలో మంత్రి సెక్యూరిటీ సిబ్బంది నందిగామ మాజీ ఎంపీటీసీ కొమ్ముకృష్ణను పక్కకు తోయడంతో పక్కనే ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి సెక్యూరిటీ సిబ్బందిలో ఒకరిపై చేయి చేసుకుని, పక్కకు తోశారు. దీంతో పక్కనే ఉన్న మంత్రి, ఎమ్మెల్యే జోక్యం చేసుకుని కార్యకర్తలను సముదాయించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కొత్తూరు, మే 7: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. కొత్తూరు మున్సిపాలిటీలో రూ. 3 కోట్లతో నాట్కో ఫార్మా కంపెనీ నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని చెప్పారు.

నాట్కో ప్రతినిధులపై బీఆర్‌ఎస్ నేతల ఆగ్రహం

అంతకుముందు బీఆర్‌ఎస్ నాయకుడు దేవేందర్‌యాదవ్ నాట్కో ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత పాఠశాల భవనంలో అంగన్‌వాడీ సెంటర్ కొనసాగేది. ఈ సెంటర్‌లో నాట్కో ప్రతినిధులు బాత్రూమ్‌లను నిర్మించారు. దీంతో అంగన్‌వాడీ సెంటర్‌లో చదువుకునే విద్యార్థులు తరగతి గదుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దేవేందర్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌ను ఎప్పుడు నిర్మిస్తారో చెప్పండని ఆయన నిలదీశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు హేమ దేవేందర్ ముదిరాజ్, నర్సంహాగౌడ్, సోమ్లా నాయక్, నాట్కో ట్రస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, నాట్కో డైరెక్టర్ ఆర్‌కే ప్రసాద్, డీఈవో సుశీందర్‌రావు, ఎంఈవో అంగూర్‌నాయక్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, నాయకులు రాజేందర్‌గౌడ్, గోపాల్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, వేణుగోపాల్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, సురేందర్, గోవర్ధన్‌గౌడ్, జగన్ పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం

నందిగామ : నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన నందిగామ, చాకలిగుట్టతండా, సంఘీగూడ గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు, మేకగూడ గ్రామంలో పంచాయతీ భవనాన్ని బుధవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కలిసి ప్రారంభించారు. చాకలిగుట్టతండాలో మాజీ సర్పంచ్ రాజూనాయక్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన బస్టాండ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాట్కో ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బిల్లులు వెంటనే విడుదల చేయాలి

వృద్ధురాలికి భరోసానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మాడ్గుల, మే 7: కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్‌ఎస్ నాయకుడు, సుద్దపల్లి మాజీ ఎంపీటీసీ గ్యార వెంకటయ్య అన్నారు. మండలంలోని సుద్దపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 19 మందిని, రేషన్ కార్డులు 281, ఇందిరమ్మ ఇండ్లు 105, రైతు భరోస 403 మందిని అధికారులు ఎంపిక చేశారు. ఇందిరమ్మ ఇండ్లు వచ్చివారు మార్చి15 లోపు బేస్మెంట్ నిర్మించాలని అధికారులు లబ్ధిదారులకు సూచించారు. నిర్మించని యడల బిల్లులు వాపసు పోతాయని అధికారులు, కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. ఇండ్లు వచ్చిన వారికి ముగ్గు పోసి ఒకసారి, బేస్మెంట్ నిర్మించాక మరోసారి ఫొటోలు తీసుకెళ్లి బిల్లులు అడుగుతే.. మీరు ఎక్కువ స్థలంలో ఇల్లు నిర్మించారని, అందుకు బిల్లులు రావడం కష్టమని అధికారులు తెలిపినట్లు లబ్ధిదారులు చెప్పినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న పేదవారు అప్పులు చేసి ఇల్లులు నిర్మించుకుంటే ఇంత వరకు బిల్లులు రాకపోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెంటనే స్పందించి సుద్దపల్లి గ్రామాన్ని సందర్శించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రేకుల షెడ్డు వద్ద తన పిల్లలతో సమీనాబేగం

అర్హులకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లు

కేశంపేట, మే 7: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక అర్హులకు ఆమడదూరంలో సాగుతోంది. కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్ గ్రామానికి చెందిన సమీనాబేగం భర్త మహమూద్ డిసెంబర్‌లో మృతి చెందాడు. దీంతో వీరికి ముగ్గురు పిల్లలు కుమార్తె సనా, కుమారులు రెహాన్, రోమన్ ఉన్నారు. తమకు ఎలాంటి భూమి, ఇల్లులేదని ఇందిరమ్మ ఇల్లు కూడా రాకపోవడం అన్యాయమని బాధితులు వాపోయారు. అర్హులకు ఇందిరమ్మ ఇంటిని నిర్మించి ఇస్తామని చెప్పిన ప్రభుత్వానికి ఇల్లులేని తన లాంటి వారు ఎందుకు కనిపించడంలేదని ప్రశ్నిస్తోంది.

అక్రమ నిర్మాణాలపై కొరడా

ఆదిబట్ల : మంగల్‌పల్లిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆదిబట్ల, మే 7: అనుమతులకు మించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లి గ్రామంలో అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టిన 7 భవనాలను మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తన సిబ్బందితో వెళ్లి కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్డింగ్ యజమానులు జీ ప్లస్ టు పర్మిషన్ తీసుకుని ఐదారు అంతస్థులు నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టిన భవణాలను గుర్తించామని అన్నారు. ప్రణాళికా ప్రకారం కూల్చివేతలు ఉంటాయని అన్నారు. ఇప్పటికైనా నిర్మిస్తున్న బిల్డింగ్ యజమానులు తీసుకున్న అనుమతుల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంగల్‌పల్లిలో అనుమతుల్లేని 7 భవనాలు కూల్చివేత

ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

పెద్దఅంబర్‌పేట : ప్రభుత్వ స్థలంలోని నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అక్రమ నిర్మాణాల కూల్చివేత

పెద్దఅంబర్‌పేట : ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే సహించేది లేదని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం రెవెన్యూ 117 సర్వేనంబర్‌లో చేపట్టిన అక్రమ కట్టడాలను బుధవారం రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. రెండు ప్రహరీలు, ఒక గదిని తొలగించారు. ప్రభుత్వ భూమి అని సూచిక బోర్డు ఏర్పాటుచేశారు.

మీసాలతండాలో ఇరువర్గాల ఘర్షణ

యాచారం, మే7: మండలంలోని కేసీతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మీసాలతండాలో భూ వివాదంలో భాగంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. ఈ ఘర్షణలో కొంత మందికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులు యాచారం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని మీసాలతండాకు చెందిన నేనావత్ భాస్కర్ అనే వ్యక్తి మంథన్‌గౌరెల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 44లో ఎకరా పొలంలో ఉన్న భూమిని సాగు చేసుకుంటున్నాడు. అక్కడే ఇల్లు కట్టుకొని నివాసముంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తన కుటుంబ సభ్యులు పొలంలో పనులు చేసుకుంటుండగా తండాకు చెందిన కొంత మంది గిరిజనులు మూకుమ్మడిగా వచ్చి పనులు చేసుకుంటున్న తన కుటుంబ సభ్యులపై రాళ్లు, కర్రలతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో నేనావత్ రాకేష్, నేనావత్ పవన్, నేనావత్ రాంజీలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ దవాఖానకు తరలించారు. బాధితుడు భాస్కర్ బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు యాచారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెద్దఅంబర్‌పేట, మే 7: స్కూటీని ఆటో ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్నది. ఎస్‌హెచ్‌వో అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. మహేశ్వరం మండల కేంద్రానికి చెందిన పోతర్ల యశ్వంత్ (22) పోచంపల్లి నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కొత్తగూడెం చౌరస్తాకు స్కూటీపై వెళుతున్నాడు. ఓ వెంచర్ సమీపంలోకి రాగానే.. ఆటో అతివేగంగా ఎదురుగా వచ్చి స్కూటీని ఢీకొట్టింది. ప్రమాదంలో యశ్వంత్‌కు తీవ్రగాయాలఅక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పట్టుబడిన వాహనాలకు రేపు వేలం

ఆమనగల్లు, మే 7: ఆమనగల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల్ మండలాల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఆమనగల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం 10.30 నిమిషాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ బుధవారం స్టేషన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. వేలంలో పాల్గొనే ఆసక్తి గలవారు రూ.10వేలు ధరావత్ చెల్లించాలని సూచించారు.

'యువ వికాస్' దరఖాస్తుల పరిశీలన



చేవెళ్ల రూరల్, మే 7 : రాజీవ్ 'యువ వికాస్' పథకానికి సంబంధించి బ్యాంకర్స్ సిబిల్ స్కోర్ పరిశీలనకు పాన్, ఆధార్ కార్డు అందజేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ సూచించారు. బుధవారం శంకర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. 'యువ వికాస్' పథకం దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని, దరఖాస్తు దారులు నేరుగా వారి పరిధిలోని సంబంధిత బ్యాంకులకు వెళ్లి పాన్, ఆధార్‌ను అందజేసి సిబిల్ స్కోర్‌ను చెక్ చేసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయడం పూర్తయిందని, 60 స్క్వేర్ యార్డ్స్‌కు మించి స్థలం ఉండకూడదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 60 గజాల స్థలం కంటే ఎక్కువ ఉండరాదని అన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఏడీఏ సురేశ్ బాబు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కొందుర్గు, మే 7: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్‌ఎస్ యువ నాయకుడు మురళీకృష్ణయాదవ్ అన్నారు. చౌదరిగూడ మండలంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కోఆర్డినేటర్‌గా నియమితులైన వినోద్‌నాయక్‌ను బుధవారం ఘనంగా సన్మానించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణాన్ని రక్షిస్తే మనతోపాటు మన భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించినవారమవుతామన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణకు హరితహారం కార్యక్రమంతో అడవుల పెంపకం జరిగిందని, నేడు చెట్లు ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు హఫీజ్, నటరాజ్, నర్సింగరావు, బాబురావు, సత్యప్రమోద్, జబ్బార్, అక్రం, రాంచంద్రయ్య, గుండు అశోక్, ఇస్మాయిల్, మల్లేశ్, నర్సింహులు, పాండు, జహంగీర్, రాంచరణ్, ఆంజనేయులు, శివరాజ్, ఆసీఫ్, చందు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.